సాక్షి శ్రీకాకుళం

సోమవారం ၊ 10 ၊ మార్చి ၊ 2025



విజయానందం

నరసన్నపేట, శ్రీకాకుళం న్యూకాలనీ: టీమిండియా ఐసీసీ చాంపియన్ ట్రోఫీ గెలవడంతో జిల్లావ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఫైనల్ మ్యాచ్ సందర్భంగా క్రీడాభిమానులు ఆదివారం టీవీలకు అతుక్కుపోయారు. నరసన్నపేటలో ఇలా అంతా కలిసి మైదానంలో ప్రత్యక్ష ప్రసారం చూశారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహార్
సోమ (సా)	మంగళద (ఉ)
6.07	4.51

న్యూస్‌రీల్

ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సోంపేట: పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో మూత్రపిండాల వ్యాధి ప్రాజెక్టులో ల్యాబ్ టెక్నీషియన్లుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ ప్రతినిధులు ప్రకటనలో తెలిపారు. సోంపేట, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల్లో రక్తం నమూనాలు, డేటా సేకరణ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏదైనా ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు ఉత్తీర్ణతతో పాటు, నియోజకవర్గంలో నివాసం ఉండే వ్యక్తులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో గానీ, నేరుగా పలాస ఆస్పత్రిలో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

తొలిరోజు నిరాశ



నిరీక్షిస్తున్న భక్తులు

అరసవల్లి: అద్భుత దృశ్యానికి మంచు అడ్డం పడింది. బంగారు కిరణ వెలుగుల్లో ఆదిత్యుడు కనిపించే అరుదైన క్షణాలను తిలకించేందుకు తరలివచ్చిన వేలాది మంది భక్తులకు తొలి రోజు నిరాశే ఎదురైంది. ఆదివారం వేకువజామున మంచు దుప్పటి కప్పేయడంతో సూర్యోదయ సమయం దాటిపోయింది. దీంతో తొలి సూర్యకిరణాలు ఆలయంలోకి ప్రవేశించలేదు. జిల్లా ఎస్సీ,ఎస్టీ కోర్టు న్యాయమూర్తి ఫణికుమార్, డీఎస్పీ వివేకానంద, సీఐ పైడపునాయుడు కుటుంబసభ్యులతో కలిసి కిరణాలను చూసేందుకు విచ్చేయగా.. వారి గోత్రనామాలతో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మ ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలను అందజేసారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ సూపరింటెండెంట్ కనకరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక బారికేడ్లు ఏర్పాట్లు చేయించారు. అలాగే సోమవారం కూడా కిరణాలు తాకే దృశ్యం కనిపించే అవకాశాలున్నందున తగిన ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలియజేశారు.

300 దుకాణాల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న జేసీబీలు



తొలగింపుల ప్రక్రియ పర్యవేక్షిస్తున్న డీఎస్పీ సీహెచ్ వివేకానంద

రణస్థలం: రణస్థలంలో హైవే అధికారులు హడలెత్తించారు. రణస్థలం టౌన్(జేఆర్ పురం)లో ఉదయం ఏడు గంటల నుంచే ఆక్రమణల తొలగింపు చేపట్టడంతో రణస్థలం రణరంగంలా మారిపోయింది. శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద, జేఆర్ పురం సీఐ ఎం.అవతారం భారీ బందోబస్తు ఏర్పాటు చేయగా.. రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు సమక్షంలో హైవే ఆధీనంలో ఉన్న ఆక్రమణల తొలగింపుల ప్రక్రియ ప్రారంభించారు. చాన్నాళ్లుగా దీనిపై చెబుతూ వస్తున్నా.. ఎన్నికల కోడ్ ముగిసన మరునాడే అధికారులు ఉప్పెనలా పనులు చేపట్టారు. ఆరు జేసీబీలతో భవనాలు, బోర్డులు, దుకాణాలు నేలమట్టం చేశారు. కొన్ని చోట్ల హైవే మార్కింగు 22.5 మీటర్లకు దాటి తీయడం, మరికొన్ని చోట్ల తక్కువగా తీయడంపై స్థానికులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. రేకులు తీసుకునేందుకు కూడా సమయం ఇవ్వలేదని ఆగ్రహించారు. దీంతో డీఎస్పీ సీహెచ్ వివేకానంద రేకులు, ఇతర వస్తువులు తీసుకునేందుకు సమయం ఇచ్చారు. మధ్యాహ్నం 2 గంటల్లోపు 300కుపైగా దుకాణాలు తొలగించేశారు.

బంగారు అవకాశం.. హద్దు ఆకాశం



ఎన్నాళ్లుగానో మదిలో మెదులుతున్న రూపం కళ్ల ముందు కదలాడే క్షణాలవి.. ఎన్నో కలలు, మరెన్నో ఆశల ప్రతిరూపాలుగా వాహనాలు మెరుపులా దూసుకెళ్లే అపురూప ఘడియలవి. గోకార్టింగ్ అంటే కేవలం వాహనాల పోటీ కాదు. ఎంతో ఇష్టపడి తయారు చేసుకున్న మోడల్, కష్టపడి తయారు చేసుకున్న ఇంజిన్, వాహనంలో ప్రతి విభాగంపై సొంత ముద్ర.. ఇలా ప్రతి అంశంలోనూ విద్యార్థులు తమను తాము చూసుకుంటారు. పోటీలో బండి పరుగులు పెడుతుంటే చూసి మురిసిపోతారు. ఓ కొత్త వాహనానికి పురుడు పోసే దశను గుండెతో ఆస్వాదిస్తారు.



గోకార్టింగ్ పోటీల్లో విద్యార్థినులు

- ఆటోమొబైల్ రంగంలో నూతన ఆవిష్కరణలకు గోకార్టింగ్ వేదిక
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా వివిధ రౌండ్లలో ఉత్తీర్ణత సాధిస్తేనే ట్రాక్ పై రైడింగ్
- గో కార్టింగ్‌తో భవిష్యత్‌లో అపారమైన అవకాశాలు ఉంటాయంటున్న నిపుణులు

టెక్కలి:

జిల్లాలో జరిగిన జాతీయ స్థాయి గోకార్టింగ్ పోటీలు ఇంజినీరింగ్ విద్యార్థుల మనసు దోచుకున్నాయి. ఆటోమొబైల్ రంగంలో ఎదగాలనుకునే విద్యార్థులకు ఈ పోటీలు ఒకరకంగా తొలి పరీక్ష లాంటివి. ఈ పోటీలు నిర్వహించడం, అందులో పాల్గొనడం, వాహనాలు తయారు చేయడం ఆషామాషీ విషయం కాదు. చాలారకాల దశలు దాటాకే బండిని ట్రాక్ మీదకు ఎక్కించాలి.

గోకార్టింగ్ పోటీలు ఎందుకు నిర్వహిస్తారు..?



ఆటోమొబైల్ రంగంపై ఆసక్తి కలిగిన ఇంజినీరింగ్ విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉండే సృజనకు పరీక్ష పెట్టేందుకే ఈ గోకార్టింగ్ పోటీలు నిర్వహిస్తారు. ఇందులో రెండు రకాల వాహనాలు తయారు చేస్తారు. వాటిలో సీవీ(ఇంజిన్‌తో తయారుచేసినవి) ఈవీ(ఎలక్ట్రికల్ వాహనాలు) ఉంటాయి. వాహనాల తయారీతో పాటు బిజినెస్ ఆలోచనలు సైతం పంచుకునే విధంగా ఈ గోకార్టింగ్ పోటీలు నిర్వహిస్తారు.

అర్హతలు ఉండాల్సిందే..

గోకార్టింగ్ పోటీల్లో పాల్గొనాలంటే కళాశాల స్థాయిలో 'మోటార్ స్పోర్ట్ కార్పొరేషన్' తయారు చేసిన రూల్ బుక్ ఆధారంగా గ్రాఫికల్‌గా డిజైన్ చేస్తూ వాహనాన్ని తయారుచేయాలి. ఆ తర్వాత పోటీల్లో పాల్గొనేందుకు ఆయా కళాశాలలు నిర్వహించే ఆన్‌లైన్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాలి. పోటీల్లో పాల్గొనే ముందు కూడా డిజైనింగ్ చెక్, ఇన్నోవేషన్ చెకింగ్‌లో భాగంగా కొత్తగా ఐఓటీ (ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్), ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత ఆలోచనలకు ప్రాముఖ్యతనిస్తారు. అలాగే బ్రేక్ టెస్ట్, లోడ్ టెస్ట్, స్పీడ్ టెస్ట్, స్టీరింగ్ టెస్ట్ తో పాటు ఇండ్యూరేషన్ టెస్ట్‌కూడా చేస్తారు. చివరగా బిజినెస్ రౌండ్‌లోనూ నెగ్గితేనే అర్హత సాధించినట్టు. ఒక్కో వాహనానికి 20 నుంచి 30 మంది టీమ్ సభ్యులు ఉంటారు. వారిలో కెప్టెన్, రైడర్, కో రైడర్ ఉంటారు.



గోకార్టింగ్ పోటీల్లో వాహనం సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న నిర్వాహకులు

వాహనం తయారీ



- గోకార్టింగ్ వాహనం తయారీకి సుమారు రూ. 70వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చవుతుంది.
- ఇందులో సీవీ వాహనాలను పూర్తిగా ఇంజిన్‌తో తయారు చేస్తారు. ఇంజిన్, మోటారు, వీల్స్, స్టీరింగ్, ఇతర పార్టులు ఉంటాయి.
- ఈవీ వాహనాలను బ్యాటరీ ఆధారంగా తయారుచేస్తారు. దీనికి బ్యాటరీ, వీల్స్, స్టీరింగ్, మోటారు ఇతర పార్టులు ఉంటాయి. ఒక్కో వాహనం సుమారు 80 నుంచి 100 కిలోల వరకు బరువు ఉంటుంది.

అఫిడవిట్ కచ్చితం..



గోకార్టింగ్ పోటీల్లో రైడర్ల పాత్ర కీలకం. కానీ రైడర్‌గా మారాలంటే విద్యార్థి తల్లి దండ్రులు, కళాశాల సిబ్బంది నుంచి అఫిడవిట్‌ను సమర్పించాల్సిందే.

గోకార్టింగ్‌తో వచ్చే అవకాశాలు

గోకార్టింగ్ పోటీల్లో పాల్గొనే అవకాశం రావడమే విద్యార్థుల విజయానికి తొలిమెట్టు లాంటిది. వాటిలో ప్రముఖ కోర్ కంపెనీల్లో ఉద్యోగవకాశాలు, ఆటోమొబైల్ రంగంలో సొంతంగా వ్యాపారం చేయాలనే ఆలోచన ఉన్న వారికి ప్రాథమిక ప్లాట్ ఫామ్‌గా గోకార్టింగ్ ఉపయోగపడుతుంది. అంతే కాకుండా కొన్ని రకాల కంపెనీలు నిర్వహించే ఫార్ములా రేస్‌లో అర్హత సాధించే అవకాశం ఉంటుంది.



ప్రమాదమైనా ఇష్టమే..



గోకార్టింగ్‌లో రైడింగ్ ప్రమాదకరమైనప్పటికీ ఎంతో ఆసక్తిగా ఉండడం వలన రైడర్‌గా మారాను. 60 ఓల్ట్స్ బ్యాటరీ సామర్థ్యంతో వాహనం తయారుచేశాం. మా కళాశాల ప్రిన్సిపాల్ కె.వీ.ఎన్.సునీత, ఫ్యాకల్టీలు రూపత్, గోపీకృష్ణ సహకారంతో గోకార్టింగ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నాం. అందరి సహకారంతో ఈవీ వెహికల్ రైడ్‌లో మొదటి స్థానంలో నిలిచాం.

– జననీ నాగరాజన్, రైడర్, బీవీఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల, హైదరాబాద్.

రెండు సార్లు రైడర్‌గా మొదటి స్థానం



మా కళాశాల సీనియర్స్ ఇన్‌స్పిరేషన్‌తో గోకార్టింగ్ రైడర్‌గా పోటీల్లో పాల్గొంటున్నాను. 150 సీసీ పల్సర్ ఇంజిన్‌తో వాహనం తయారుచేశాం. రైడర్‌గా రెండు సార్లు మొదటి స్థానంలో నిలిచాం. మాది మధ్య తరగతి కుటుంబం. మా నాన్న ఆటో డ్రైవర్, అమ్మ గృహిణి. భవిష్యత్‌లో మంచి కోర్ కంపెనీలో ఉద్యోగం సాధించడమే లక్ష్యం.

– వి.సునీల్, రైడర్, రఘు ఇంజినీరింగ్ కళాశాల, విశాఖపట్టణం

గోకార్టింగ్‌తో మంచి అవకాశాలు



గోకార్టింగ్ వల్ల మెకానికల్, ట్రిపుల్ ఈతో పాటు మిగిలిన ఇంజినీరింగ్ విద్యార్థులకు భవిష్యత్‌లో మంచి అవకాశాలు లభిస్తాయి. ఆటోమొబైల్ రంగంలో స్థిరపడేందుకు ప్రాథమికంగా ఉపయోగపడుతుంది. అంతే కాకుండా కోర్ కంపెనీల్లో మంచి ఉద్యోగవకాశాలు లభిస్తాయి. మా కళాశాల డైరక్టర్ వీవీ నాగేశ్వరరావు సహకారంతో రెండు సార్లు గోకార్టింగ్ పోటీలు నిర్వహించాం.

– డి.శ్రీరాములు, మెకానికల్ విభాగం డీన్, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, టెక్కలి

చెన్నై నుంచి..



మాది చెన్నైలో సిమెట్స్ ఇంజినీరింగ్ కళాశాల. విద్యార్థుల ఆసక్తి మేరకు సుమారు వెయ్యి కిలోమీటర్ల దూరంలో ఉన్న టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో గోకార్టింగ్ పోటీల్లో పాల్గొన్నాం. సుమారు రూ.60 వేల వరకు ఖర్చు అయినప్పటికీ విద్యార్థుల కోసం వచ్చాం.

– ఎస్.హనీస్ ఆనంద్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సిమెట్స్ కళాశాల, చెన్నై

ఆ ప్రయాణమే ప్రాణ సంకటం

- డయాలసిస్ రోగులకు ప్రయాణపు పాట్లు
- 108 అంబులెన్స్‌కు ఆశ పడి ఫోన్ చేస్తే ఆ అవకాశం లేదని సమాధానం
- బస్సు సదుపాయం లేక ఆటోల్లో అవస్థలు
- గత ప్రభుత్వంలో ఐదేళ్లూ 108 వాహనంలోనే రోగుల రాకపోకలు



కవిటిలో డయాలసిస్ సెంటర్‌లో సేవలు అందుకుంటున్న రోగులు

కవిటి: ఆస్పత్రి, సదుపాయం, మందులు, క్యూలు.. ఇవన్నీ తర్వాతి సంగతి. పల్లెల్లో ఉన్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఆస్పత్రులకు వెళ్లడానికే ఆపసోపాలు పడుతున్నారు. ముఖ్యంగా కవిటి మండలంలో సోంపేట–కవిటి–ఈదుపురం రోడ్డుతో పాటు, శిలగాం–జగతి–కవిటి, కవిటి–రాజపురం–కొజ్జీరియా నెలవంక–కవిటి, ఇద్దివానిపాలెం–కవిటి మార్గాల్లో ఆర్టీసీ బస్సు సేవలు లేవు. ఈ నేపథ్యంలో బాధితులు ఆస్పత్రికి వెళ్లాలంటే ఆటోలే శరణ్యం. డయాలసిస్ పేషెంట్లకు మూడు షిఫ్టులలో డయాలసిస్ చేస్తారు. ఆ సమయానికి రోగులు కచ్చితంగా వెళ్లి తీరాలి. కానీ ఆ మేరకు రవాణా సదుపాయాలు లేవు.



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బాధితులను 108 అంబులెన్స్‌లో తీసుకెళ్లేవారు. దీంతో ఈ ఇబ్బందులు ఉండేవి కావు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక 108 సేవలు డయాలసిస్ రోగులకు అందని ద్రాక్షలాగా మిగిలిపోయాయి. సకాలంలో డయాలసిస్ చేసుకునేందుకు రాకపోతే తర్వాత షిఫ్ట్‌లో వచ్చే రోగికి ఆలస్యం కారణంగా ఇంటికి వెళ్లడం తీవ్ర ఇబ్బందుల్ని సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో గడచిన పదినెలల కాలంలో డయాలసిస్ కేంద్రాలకు వస్తున్న రోగులు తీవ్రమైన సంఘర్షణ అనుభవిస్తున్నారు. ప్రభుత్వం తమ కోసం 108 సేవలు పునరుద్ధరించాలని కోరుతున్నారు.

ప్రాణం కోసం పాట్లు



మాది నెలవంక పంచాయతీ. వారానికి మూడుసార్లు కవిటిలో డయాలసిస్ చేయించుకుంటున్నాను. గతంలో 108లో వచ్చే వెసులుబాటు ఉండేది. ఆ ఖర్చులు మిగిలేవి. మరో అవసరం గట్టెక్కేది. కానీ ప్రస్తుతం ఆటోల్లోనే అధిక మొత్తం చెల్లించి వస్తున్నాం. ప్రభుత్వం మా దీనస్థితిపై జాలి చూపాలి.

– లాభాల ప్రతిమ, డయాలసిస్ రోగి, నెలవంక

ఎందుకింత నిర్లక్ష్యం..?



సాడి శ్యాంప్రసాద్ రెడ్డి

కవిటి: కిడ్నీ బాధితులపై కూటమి ప్రభుత్వ వైఖరికి జోహార్లు అర్పించడం తప్ప ఏమీ చేయలేమని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్ ప్రసాద రెడ్డి చురకలు అంటించారు. 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైన 'మందుల కోత'పై ఆయన ఆదివారం సాక్షితో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలోనే అదనపు డయాలసిస్ మెషీన్లు ఏర్పాటు చేసినా వాటిని వినియోగంలోకి తీసుకురాకపోవడం దారుణమన్నారు. ఒకప్పుడు డయాలసిస్‌తో పాటు ఉచితంగా మందులు ఇచ్చేవారని, నేడు మందులు కూడా ఇవ్వలేని దీనస్థితికి చేరుకున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం కళ్లు తెరవాలని కోరారు.

'యువత పోరు' పోస్టర్ ఆవిష్కరణ



యువత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్, పార్టీ ముఖ్య నేతలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 12న 'యువత పోరు' అనే కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ యువత పోరు కార్యక్రమానికి అన్ని ప్రాంతాల నుంచి నిరుద్యోగ యువత, విద్యార్థులు హాజరు కావాలని కోరారు. విస్మరించిన హామీలను ప్రభుత్వానికి గుర్తు చేసేలా వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆ రోజు జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావుపూలే పార్కు వద్ద నుంచి కలెక్టరేట్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టర్‌కి వినతి పత్రం అందిస్తామన్నారు. అన్ని నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

క్లుప్తంగా

భక్తజన జాతర



రాజమ్మ తల్లి జాతరలో జనసందోహం

గార: మండలంలోని చిన్న వత్సవలసలో కొలువైన రాజమ్మ తల్లి (రాజరాజేశ్వరి) దర్శనానికి ఐదో ఆదివారం ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. చాలా మంది శనివారం రాత్రే వచ్చేసి ఉదయాన్నే సమీప సముద్రంలో పవిత్ర స్నానాలు ఆచరించిచారు. అనంతరం భూలోకమ్మ, రాజరాజేశ్వరి (రాజమ్మతల్లి)ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. తొలి సంతానానికి పుట్టుకొప్పు తీయించి ముడుపులు చెల్లించుకున్నారు.

ముగిసిన టెక్నివర్స్ ఫెస్ట్



విద్యార్థులు ప్రదర్శించిన ఫ్లాష్‌మాబ్ డ్యాన్స్

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) శ్రీకాకుళం ఎస్ఎంపురం క్యాంపస్‌లో కొనసాగుతున్న టెక్నివర్స్ ఫెస్ట్–2025 ఆదివారంతో ముగిసింది. మూడు రోజుల పాటు ఉత్సాహంగా, విజ్ఞానదాయకంగా ఈ ఫెస్ట్ కొనసాగింది. చివరి రోజు క్యాంపస్‌లో విద్యార్థులు ప్రదర్శించిన మాబ్‌ఫ్లాష్ డ్యాన్స్ ఉర్రూతలూగించింది. అనంతరం వివిధ విభాగాల విజేతలకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, కన్వీనర్ గేదెల రవి, సహాయ కన్వీనర్ తేజ్‌కిరణ్, పీఆర్‌ఓ మామిడి షణ్ముఖ పాల్గొన్నారు.

డీఎస్సీ–2003 టీచర్లకు పాత పెన్షన్ అమలుచేయాలి



మాట్లాడుతున్న కొత్తకోట శ్రీహరి

శ్రీకాకుళం అర్బన్: డీఎస్సీ–2003 ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానం అమలు చేయాలని డీఎస్సీ ఫోరం–2003 జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీహరి డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలోని ఎన్జీవో కార్యాలయంలో ఆదివారం ఫోరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2003 డీఎస్సీ నియామకాలలో ప్రభుత్వమే రెండేళ్లు ఆలస్యం చేసిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 మేరకు పాత పెన్షన్ విధానాన్ని తమకూ వర్తింప చేసి న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఫోరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా పి.శ్రీహరి, కో–కన్వీనర్లుగా పి.శ్రీకర్, కె.ప్రకాష్, బి.శ్రీనివాసరావు, ఎ.లక్ష్మణరావులు ఎన్నికయ్యారు. సమావేశంలో సభ్యులు ఎస్.ఫల్గుణరావు, ఎం.బుచ్చిబాబు, జి.భాస్కరరావు, ఆపస్ జిల్లా అధ్యక్షులు దువ్వల శివరాం ప్రసాద్, జి.చిన్నికృష్ణంనాయుడు పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సులో గంజాయి సీజ్



మడపాం టోల్ గేట్ వద్ద బస్సులో తనిఖీలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

నరసన్నపేట: గంజాయి అక్రమ రవాణాను శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అడ్డుకున్నారు. జాతీయ రహదారిపై తులసీ ట్రావెల్ బస్సులో మూడు సూటు కేసుల్లో ఉన్న గంజాయి బండిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్న నలుగురిలో ముగ్గురు పట్టుబడగా ఓ వ్యక్తి పరారయ్యాడు. అతని కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. సాధారణ తనిఖీల్లో భాగంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను మడపాం టోల్‌గేట్ వద్ద ఆదివారం ఆపగా గంజాయి రవాణా గుట్టు రట్టయ్యింది. పూర్తి వివరాలు సోమవారం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

లక్ష్మణరావుపై కేసు నమోదు

ఎచ్చెర్ల: లావేరు గ్రామానికి చెందిన వృద్ధురాలు సౌభాగ్యవతి ఎస్పీ కార్యాలయానికి వచ్చి తన ఆవేదన వెల్లడించిన వైనంపై 'వృద్ధురాలిపై కన్నకొడుకు దాష్టీకం' శీర్షికన ఈ నెల 9న సాక్షిలో వచ్చిన కథనానికి లావేరు పోలీసులు స్పందించారు. సౌభాగ్యవతి కుమారుడు లక్ష్మణరావుపై కేసు నమోదుచేశారు. సౌభాగ్యవతి తన భర్త పేరిట ఉన్న స్థలంలో దుకాణం పెట్టుకునేందుకు ఇటీవల ప్రయత్నించగా చిన్న కుమారుడు లక్ష్మణరావు అడ్డుకుని తన తల్లిని చెక్కతో గాయపరిచిన సంగతి తెలిసిందే.

ఉపాధ్యాయ బదిలీల్లో.. దివ్యాంగులపై అక్కసు!



- ఇటీవల విడుదల చేసిన ముసాయిదాపై తీవ్ర విమర్శలు
- 80 వరకు ప్రాధాన్యత పాయింట్లు పెంచడంపై అభ్యంతరం
- సవరణలు చేసి న్యాయం చేయాలని వేడుకోలు



జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం

శ్రీకాకుళం న్యూకాలనీ: దివ్యాంగ ఉపాధ్యాయులపై కూటమి సర్కారు అక్కసు ప్రదర్శిస్తోంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయ బదిలీల నిబంధనల ముసాయిదా మార్గదర్శకాలు దివ్యాగుంలు, శారీరక వైకల్యం, అనారోగ్య రుగ్మతలతో బాధపడుతున్న వారికి తీరని నష్టం కలిగించేలా ఉన్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గ్రేడ్–2 హెచ్ఎంలు, ఉపాధ్యాయుల సీనియారిటీ, రోస్టర్ పాయింట్లను తుంగలోకి తొక్కిన కూటమి సర్కారు.. టీచర్ల వైకల్య శాతాన్ని అమాంతం పెంచేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా ఆర్థోపెడికల్, విజువల్లీ ఛాలెంజ్డ్ వంటి సమస్యలతో బాధపడుతున్నవారికి ఈ నిబంధనలతో తీవ్ర అన్యాయం జరిగి బదిలీల్లో సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని పలువురు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో పాఠశాల విద్య పరిధిలో దివ్యాంగులు, వివిధ తీవ్ర రుగ్మతలు కలిగినవారు 294 మంది వరకు ఉన్నట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

వైకల్య శాతాన్ని తీసుకొచ్చిందే చంద్రబాబు..

వాస్తవానికి వైకల్యశాతాన్ని బదిలీల్లోకి తీసుకొచ్చి 2017లో అన్యాయం చేసింది నాడు చంద్రబాబు సారధ్యంలోని టీడీపీ సర్కారేనని వారంతా గుర్తుచేస్తున్నారు. నాడు 40 శాతం వైకల్యం కలిగినవారికి ప్రాధాన్యత పాయింట్లను కేటాయించారు. 2023లో వైఎస్సార్‌సీపీ అధికారంలో వచ్చాక దానిని విభిన్నమైన రీతిలో వైకల్యాన్ని గుర్తించి మేలుచేసేలా చర్యలు చేపట్టింది. దీంతో ఎక్కువ వైకల్యం కలిగినవారికి బదిలీల్లో మరింత న్యాయం జరిగింది. వైకల్యశాతాన్ని బట్టి వారికి సమన్యాయం చేశారు. మరళా కూటమి సర్కారు 2025లో చేపట్టనున్న బదిలీల మార్గదర్శకాల్లో వైకల్యాన్ని 80 శాతం వరకు తీసుకెళ్లడాన్ని వారంతా తప్పుపడుతున్నారు. ప్రస్తుతం నడవలేని స్థితిలో ఉన్నవారికి వైకల్య శాతం 70 శాతం దాటి ఇవ్వడంలేదు. ఈ కోవకు చెందినవారు జిల్లాలో 50 మంది వరకు ఉన్నారు. దీనికితోడు ట్రాన్స్‌ఫర్స్‌కు మాన్యువల్ సర్టిఫికెట్ సరిపోదు. శ్రీకాకుళంలో రిమ్స్ మెడికల్ బోర్డులో డాక్టర్లు సర్టిఫై చేసిన సర్టిఫికెట్ మాత్రమే అనుమతిస్తారు. ఈ లెక్కన వారంతా తీవ్ర అన్యాయానికి గురవుతారని దిగులు చెందుతున్నారు. ప్రభుత్వ పెద్దలు, విద్యాశాఖ ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయాలని వారంతా విజ్ఞప్తి చేస్తున్నారు.

శారీరక వికలాంగులు అంటే..

- దృశ్యపరమైన వారు/ఆర్థోపెడికల్ చాలెంజ్‌డ్ ఉద్యోగులకు 80 శాతం కంటే ఎక్కువ లేదా సమానం.
- దృశ్యపరమైన వారు/ ఆర్థోపెడికల్ చాలెంజ్డ్/ వినికిడి లోపం ఉన్న ఉద్యోగులకు 70 శాతం కంటే ఎక్కువ లేదా సమానం.
- క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ/కర్ణిక సెప్టల్ లోపాన్ని సరిదిద్దడం/అవయవ మార్పిడి, మేజర్ న్యూరో సర్జరీ, బోన్ టీబీ, కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్/డయాలసిస్, వెన్నెముక శస్త్రచికిత్స వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు.
- మానసిక దివ్యాంగులు/చికిత్స పొందుతున్న వారిపై ఆధారపడిన పిల్లలు, జీవిత భాగస్వామి కలిగినవారు
- జువెనైల్ డయాబెటీస్/ తలసేమియా వ్యాధి/హీమోఫిలియా వ్యాధి/మస్కులర్ డీసీజ్/ కండర క్షీణతతో బాధపడుతున్న వారిపై ఆధారపడిన పిల్లలతో టీచర్లు. అలాగే చికిత్స కొనసాగుతున్న టీచర్లకు ప్రాధాన్యతా పరంగా పాయింట్లను కేటాయించనున్నారు.
- ప్రధానోపాధ్యాయులు గ్రేడ్–2/ఉపాధ్యాయులు పైన పేర్కొన్న కేటగిరీ కింద బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న వారు జిల్లా/రాష్ట్ర మెడికల్ బోర్డ్ ద్వారా ధ్రువీకరించబడిన అన్ని మెడికల్ రిపోర్టులు/సర్టిఫికెట్లను ఆన్‌లైన్ ద్వారా కొత్తగా సమర్పించాలి. పాత సర్టిఫికెట్లను ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించబోమని మార్గదర్శకాల్లో ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది.

అభ్యంతరాల స్వీకరణ..



ఉపాధ్యాయ బదిలీ నిబంధనల ముసాదాయిదా మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. విద్యాశాఖలో అన్ని వర్గాల అభిప్రాయాలను తీసుకుంటుంది. ఎలాంటి అభ్యంతరాలున్నా ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుంది. ప్రత్యేకంగా మాడ్యూల్‌ను కూడా ఆన్‌లైన్‌లో ఉంచింది. దివ్యాంగులు వారి సమస్యలు తెలియజేయవచ్చు.

– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, జిల్లా విద్యాశాఖాధికారి, శ్రీకాకుళం

పలాసలో వైభవ్ జ్యూయలర్స్ ప్రారంభం



పలాసలో వైభవ్ జ్యూయలర్స్ ప్రారంభోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న యార్లగడ్డ వెంకన్నచౌదరి

కాశీబుగ్గ: కోస్తా ఆంధ్రా, తెలంగాణలో తమకంటూ ప్రత్యేక ప్రస్థానాన్ని ఏర్పాటు చేసుకున్న వైభవ్ జ్యూయలర్స్ నూతన బ్రాంచిని పలాసలో గొప్పగా ప్రారంభించింది. పలాస–కాశీబుగ్గ కేటీ రోడ్డులో ఆదివారం వైభవ్ జ్యూయలర్స్ 19వ బ్రాంచిన పలాస నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సంస్థ 19 బ్రాంచ్‌లు ఏర్పాటు చేసిందంటే కొనుగోలుదారుల ఆదరణ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. వ్యాపారంతో పాటు సుమారు 1200 మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. వైభవ్ సంస్థల సీఎండీ భారత మల్లికా రత్నకుమారి గ్రంధి మాట్లాడుతూ ఇప్పటికే తమ సంస్థ విశాఖపట్నం, గాజువాక, గోపాలపట్నం, అనకాపల్లి, కాకినాడ, రాజమహేంద్రవరం, తుని, పార్వతీపురం, బొబ్బిలి, శ్రీకాకుళం, విజయనగరం, రాజాం, అనంతపురం, అమలాపురం, యలమంచిలి, దిల్‌సుఖ్‌నగర్, ఏఎస్‌రావ్‌నగర్, మంచిర్యాల తదితర చోట్ల బ్రాంచిలు ఏర్పాటు చేసిందన్నారు. వైభవ్ సంస్థ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ జె.రఘునాథ్ మాట్లాడుతూ అద్భుత శ్రేణి షాపింగ్ అనుభవంతో పాటు 916 హాల్‌మార్క్ బంగారు ఆభరణాలు, సర్టిఫైడ్ డైమండ్స్, వెండి వస్తువులు, వివాహ ఆభరణాలను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు.

మన పలాస గురించి తెలుసుకుందాం కాంటెస్ట్ డ్రాలో గెలుపొందిన ఏడుగురు విజేతలకు ఒక్కొక్కరికి 1 గ్రాములు 22 క్యారెట్ బంగారు కాయిన్లు అందజేస్తామన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో క్యాష్యూ ట్రేడర్ మల్లా కాంతారావు, హోల్‌టైమ్ డైరెక్టర్ సాయి కీర్తన గ్రంధి, సీఓఓ గొంట్ల రాఘల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింధూరి వెంకటేష్, ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, పీసీఎంఏ అధ్యక్షుడు మల్లా శ్రీనివాస్, పలాస వైశ్య సంఘం అధ్యక్షుడు మల్లా కృష్ణరావు, టీడీపీ నాయకులు లొడగల కామేశ్వరరావు, చిన్ని, శాసనపురి మోహనరావు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

కన్నీళ్లకే.. కన్నీళ్లొచ్చే..!



- పేద మహిళకు పెద్దకష్టం
- కిడ్నీవ్యాధి సోకడంతో ఇబ్బందులు
- దాతలు ఆదుకోవాలని వేడుకోలు

నందిగాం: ఆడపిల్ల పుట్టిందని నాడు తండ్రి విడిచిపెట్టి వెళ్లిపోయాడు. జీవితాంతం తోడు ఉంటానని అగ్నిసాక్షిగా పెళ్లాడిన భర్త రెండేళ్లకే వదిలేశాడు. అయినా ధైర్యం కోల్పోక ముందుకు సాగుతున్న ఆమెకు కిడ్నీ భూతం కాటేయడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. విధి చేతిలో ఓడిపోయి నిస్సహాయ స్థితిలో సాయం కోసం ఎదురుచూస్తున్న కాంతమ్మ దీనస్థితి ఇది. వివరాల్లోకి వెళ్తే.. నందిగాం మండలం మర్లపాడుకు చెందిన కోనారి వెంకయ్య, నీలమ్మల కుమార్తె కాంతమ్మ. అయితే కాంతమ్మ పుట్టిన తర్వాత మగబిడ్డ పుట్టలేదని చెప్పి తండ్రి వెంకయ్య కోపంతో భార్య, కుమార్తెను విడిచిపెట్టి మరో మహిళతో వెళ్లిపోయాడు. దీంతో పేదరికంలో పెరిగిన కాంతమ్మ కూలి పనులు చేసుకుంటూ తల్లికి తోడుగా ఉండేది. పెళ్లి ఈడు వచ్చేసరికి గ్రామస్తులు సహకరించి సమీప ప్రతాపవిశ్వనాథపురం గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం చేశారు. అయితే తాగుడుకు బానిసైన ఆయన రెండేళ్లకే భార్యను విడిచిపెట్టడంతో కాంతమ్మ మరలా కన్నవారింటికి చేరింది.

కూలి పనులతోనే జీవనం

కూలీ పనులు, ఉపాధి పనులు చేసుకుంటూ తల్లి ఉంటున్న పూరి గుడిసెలో కాంతమ్మ జీవనం సాగిస్తుండేది. వదిలి వెళ్లిన తండ్రి ఐదేళ్ల క్రితం గ్రామ సమీప తోటలో శవంగా మరడంతో కుమారుడిలా అంత్యక్రియలు చేసి కన్నరుణం తీర్చుకుంది. విడిచిపెట్టిన భర్త కొద్దిరోజులకే చెరువులో పడి విగతజీవిగా మారాడు. తల్లి వృద్ధాప్యానికి చేరుకొని కంటి సమస్యతో కుమార్తె కాంతమ్మ మీద ఆధారపడింది. అయినప్పటికీ ధైర్యంగా కష్టాలను ఎదుర్కొని తల్లికి సపర్యలు చేసుకుంటూ జీవనం సాగించేది. అయితే రెండేళ్ల క్రితం కిడ్నీ భూతం కాంతమ్మకు సోకింది. మొదటిలో కూలీ చేసిన డబ్బులతో వైద్యం పొందేది. అయితే క్రమేపీ వ్యాధి తీవ్రత పెరిగి కూలీ చేసుకోలేని స్థితికి చేరుకుంది. దీంతో గ్రామంలోని కొంతమంది యువకులు ఆర్థిక సాయం చేస్తూ పలాసలో ఉన్న కిడ్నీ ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స అందిస్తున్నారు. అయితే ఇటీవల వ్యాధి తీవ్రత బాగా పెరగడంతో కాంతమ్మ మంచానికే పరిమితమైపోయింది. ఫలితంగా తల్లీకూతుళ్లు ఇద్దరూ ఇబ్బంది పడుతున్నారు. పూట గడవడమే కష్టంగా మారిన స్థితిలో డయాలసిస్ చేయించుకునే స్థోమత లేకుండా పోయింది. దీంతో జీవితంలో ఎన్నో కష్టాలను ధైర్యంగా ఎదుర్కొన్నా, ఎక్కడా చేయిచాచని కాంతమ్మ విధికి తలవంచి దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. మనసున్న మారాజులు ఎవరైనా ఆదుకోవాలని కోరుతోంది. తనకు సాయం చేయాలనుకునేవారు **9440487406** నంబర్‌ను సంప్రదించాలని కోరుతోంది.

ఆశలు గల్లంతు

- సముద్రంలో గల్లంతైన గ్రూప్–2 అభ్యర్థి
- రాజమ్మతల్లి జాతర స్నానాల్లో అపశ్రుతి
- మరో నలుగురిని కాపాడిన మెరైన్ పోలీసులు



పిన్నింటి జయలక్ష్మికి సపర్యలు చేస్తున్న మెరైన్ పోలీసులు, (ఇన్‌సెట్లో) గల్లంతైన కొడమటి అశోక్ (ఫైల్)

గార: మండలంలోని చిన్న వత్సవలస రాజమ్మ తల్లి జాతర సముద్ర స్నానాల్లో అపశృతి చోటుచేసుకుంది. ఆదివారం మధ్యాహ్నం జి.సిగడాం మండలం దేవరవలసకు చెందిన తండ్రీ కొడుకులు కొడమటి ఈశ్వరరావు, అశోక్(23) సముద్ర స్నానానికి వెళ్లగా అలల తాకిడి గల్లంతయ్యారు. తోటివారు కేకలు వేయడంతో మెరైన్ పోలీసులు స్పందించి తండ్రి ఈశ్వరరావును ఒడ్డుకు తీసుకురాగలిగారు. అశోక్ ఆచూకీ దొరకలేదు. అశోక్ ఎంఎస్సీ పూర్తి చేసి, ఇటీవలే గ్రూప్–2 పరీక్షలు రాశాడు. తండ్రి ఈశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గార ఎస్ఐ ఆర్.జనార్దన కేసు నమోదు చేశారు. కాగా, ఇదే ప్రాంతంలో చీపురుపల్లి మండలం కాపుశంభాం గ్రామానికి చెందిన చందక వంశీ, పిన్నింటి జయలక్ష్మీ, పిన్నింటి దిలీప్ సముద్ర స్నానానికి దిగి చిక్కుకుపోతున్న తరుణంలో మెరైన్ ఎస్ఐ హరికృష్ణ టీం సభ్యులు గమనించి రక్షించారు. లైఫ్ జాకెట్లు ఉపయోగించి నీటిలో ఇబ్బందులు పడుతున్న ముగ్గురినీ ఒడ్డుకు తీసుకొచ్చి సపర్యలు చేశారు.

అన్నయ్యపై తమ్ముడి దాడి



గాయపడిన వినోద్

టెక్కలి రూరల్: మండల కేంద్రం టెక్కలిలోని రెల్లివీధి సమీపంలో పరపటి వినోద్ అనే వ్యక్తి తీవ్ర గాయాలతో అంబేడ్కర్ జంక్షన్ నుంచి పోలీస్‌స్టేషన్ వైపుగా భార్యాపిల్లలతో కలిసి రోడ్డుపై వెళ్లడం ఆదివారం స్థానికంగా కలకలం రేపింది. తలపై రక్తాలు కారడంతో ఏమైందని అడిగినా స్పందించకపోవడంతో స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం గాయపడిన వ్యక్తిని టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై టెక్కలి సీఐ విజయ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా అన్నదమ్ముల మధ్య గొడవ జరిగిందని, తమ్ముడు బాల అన్నయ్య వినోద్‌ను కర్రతో కొట్టి గాయపరిచాడని తెలిపారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు.

అ'పూర్వ' సమ్మేళనం



పూర్వ హెచ్ఎంను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కొత్తూరు : కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1970–71 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం అదే పాఠశాల ఆవరణలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 55 ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలిసి ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ హెచ్ఎం ఎద్దు గోపాలదాసునాయుడుతో పాటు పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

స్నానానికి బావిలో దిగి..

- డిప్లమో విద్యార్థి మృతి
- గోపీనాథపురంలో విషాదఛాయలు



దీపక్ మృతదేహం

టెక్కలి రూరల్: మండలంలోని గోపినాథపురం గ్రామానికి చెందిన బెండి దీపక్ అలియాస్ కుమారస్వామి (17) ఆదివారం స్నేహితులతో కలసి గ్రామ సమీపంలో ఉన్న నేల బావిలో స్నానానికి దిగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే స్నేహితులు బయటకు తీసి టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే కుమారస్వామి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమారస్వామి ఎచ్చెర్లలో పాలిటెక్నిక్ డిప్లమో చదువుతున్నాడు. చేతికందిన కుమారుడు మృత్యుఒడికి చేరడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తండ్రి ఆనంద్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ద్విచక్ర వాహనం దగ్ధం



కాలిపోయిన బైక్

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి శివసాగర్ తీరంలో శనివారం రాత్రి ఓ ద్విచక్ర వాహనం దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎస్సై నిహార్ ఆదివారం సంఘటన స్థలానికి వెళ్లి వాహనాన్ని పరిశీలించారు. నంబర్ ప్లేట్ ఆధారంగా ద్విచక్రవాహనం కొత్తూరు మండలానికి చెందిన వ్యక్తిదిగా గుర్తించామని చెప్పారు.రెండు రోజులు క్రితం షోరూమ్‌కు అప్పగించి కొత్త వాహనాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. అయితే ఇదే వాహనాన్ని ఇక్కడికి ఎవరు తీసుకువచ్చారు.. ఎందుకు నిప్పు పెట్టారో తెలియాల్సి ఉందన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు

పొయ్యి వెలిగేనా..?

- అవస్థలు పడుతున్న పొందూరు, పరిసర ప్రాంత ప్రజలు
- సిలిండర్లు రాకపోవడంతో వంటకు ఇబ్బందులు

పొందూరు: స్థానిక ఇండేన్ గ్యాస్ లబ్ధిదారులు పడరాని పాట్లు పడుతున్నారు. అధికారులు ఇక్కడి ఇండేన్ గ్యాస్‌ను సీజ్ చేసి గ్యాస్ సరఫరా బాధ్యతలను తాత్కాలికంగా వేరొక ఏజెన్సీకి అప్పగించారు. మూడు రోజుల కిందట గోడౌన్ తాళాలు రణస్థలం ఏజెన్సీకి అందించారు. కానీ గ్యాస్ సరఫరా ఎలా జరుగుతుందనేది చూడలేదు. పొందూరు, జి.సిగడాం, లావేరు, సంతకవిటి, ఎచ్చెర్ల మండలాల్లో పలు పంచాయతీల్లో పొందూరు ఇండేన్ ఏజెన్సీ సేవలు అందుతున్నాయి. ఈ ఏజెన్సీకి తాళాలు పడడంతో సుమారు 60 పంచాయతీల్లో ప్రజలకు గ్యాస్ అందని పరిస్థితి నెలకొంది. ఆయా పంచాయతీల్లో దాదాపు 28వేల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ నెల ఒకటో తేదీకి సుమారు 700 మంది బుక్ చేసుకోగా, ఆదివారం నాటికి సుమారు 2 వేల ఒక వంద మంది వరకు బుక్ చేసుకొన్నారు. గ్యాస్ బుక్ చేసుకోవడం రాని వారు వేల మంది ఉన్నారు. వారంతా ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లతో పాటు గృహాలు, తోపుడు బళ్ల వారు సైతం ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

ఎదురు చూపులే..

వారం రోజులుగా గ్యాస్ కోసం పొందూరు వాసులు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. గ్యాస్ గోడౌన్ వద్దకు వెళ్లినా కూడా సిలిండర్ దొరకడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్యాస్ సరఫరా జరిగేట్టు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరుతున్నారు.





మూసి ఉన్న గ్యాస్ గోడౌన్

డెలివరీ బాయ్స్ చేసిన తప్పు



గ్యాస్ డెలివరీ బాయ్స్ చేసిన తప్పులకు ఏజెన్సీని రద్దు చేశారు. ఇది సమంజసం కాదు. ఫలితంగా గ్యాస్ లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీని రద్దు చేయడంపై దృష్టి సారించిన అధికారులు పంపిణీ చేయించడంపైనా శ్రద్ధ చూపాలి.

– పొన్నాడ షణ్ముఖరావు, లబ్ధిదారుడు, పొందూరు

రాజకీయాలు చేస్తున్నారు..



గ్యాస్ బుక్ చేసి ఆరు రోజులైంది. ఇప్పటికే ఐదు సార్లు గ్యాస్ గోడౌన్‌కు వచ్చాను. గోడౌన్ మూసే ఉంటుంది. ఇంటి దగ్గర గ్యాస్ అయిపోయింది. ఇంటి వద్ద ఇబ్బందులు పడుతున్నాం. రాజకీయాలు చేసి ప్రజలకు ఇబ్బందులు పెడుతున్నారు.

– గురుగుబెల్లి ప్రకాశరావు, లబ్ధిదారుడు, పిల్లలవలస



గ్యాస్ గోడౌన్ వద్దకు వచ్చి ఉసూరుమంటూ వెనుదిరిగిన లబ్ధిదారులు